కేసీఆర్ పాలనకు కేంద్రం కితాబు

- బీఆర్ఎస్ హయాంలో తగ్గిన మాతా శిశు మరణాలు
- దక్షిణాది రాష్ట్రాల్లో మొదటి స్థానంలో కేరళ, రెండో స్థానంలో తెలంగాణ
- 2019-2021 ఎస్ఆర్ఎస్ గణాంక నివేదిక విడుదల

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): పదేళ్ల కేసీఆర్ పాలనలో తల్లీబిడ్డల ఆరోగ్యం సంరక్షణ కోసం చేపట్టిన కృషికి కేంద్రం కితాబిచ్చింది. మాతా శిశు సంరక్షణలో తెలంగాణ రాష్ట్రం అధిక ప్రగతిని సాధించిందని తాజా నివేదికల్లో స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఆరోగ్య కార్యక్రమాలకు గౌరవ సూచకంగా, కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన శిశు మరణాల రేటు, తల్లి మరణాల రేటు తగ్గించడంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానాల్లో ఉంది. గురువారం ఢిల్లీలోని జనగణన ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయం 2019-21 నమూనా నమోదు వ్యవస్థ (ఎస్ఆర్ఎస్) గణాంక నివేదిక విడుదల చేసింది.ఆ నివేదిక ప్రకారం దక్షిణ భారతదేశంలో కేరళ తరువాత తల్లి మరణాల రేటు తగ్గింపులో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది.

మెరుగైన స్థితిలో ఉన్నాం..

శిశు మరణాల రేటు గ్రామీణం, పట్టణ ప్రాంతాల్లో కాస్త వ్యత్యాసంగా ఉంది. నగరాల్లో 16, గ్రామీణంలో 23గా నమోదైంది. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటులో 2014-15లో 41గా ఉండగా, 2021 నాటికి 22కి తగ్గింది. దేశ సగటు 31 కాగా, తెలంగాణ మెరుగైన స్థితిలో ఉంది.

ఇదీ పరిస్థితి...

తల్లి మరణాల రేటులో దేశ సగటు 93ఉండగా, దక్షిణ భారత సగటు రేటు 47గా నమోదైంది. తెలంగాణ (45), ఆంధ్రప్రదేశ్ (46), కర్ణాటక (63),తమిళనాడు(49), కేరళ (20), బీహార్ (100), ఉత్తర ప్రదేశ్(151), గుజరాత్(53), మధ్యప్రదేశ్(175), ఛత్తీస్‌గఢ్ (132) ఉండటం గమనార్హం. శిశు మరణాల రేటులో దేశ సగటు 27 నమోదు కాగా.. తెలంగాణ (20), ఆంధ్రప్రదేశ్ (22), కర్ణాటక (17), తమిళనాడు(12), కేరళ(6) ఉండటం విశేషం. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటులో దేశ సగటు (31) ఉండగా, తెలంగాణ (22), తమిళనాడు(14), కేరళ (8)రాష్ట్రాలు ఉన్నాయి.

శిశు మరణాల రేటు తగ్గింది..

తల్లి మరణాల రేటులో దేశ సగటు 93గా ఉండగా, తెలంగాణలో 45గా నమోదైంది. కేరళ (20), తమిళనాడు (49), ఆంధ్రప్రదేశ్ (46), కర్ణాటక (63)గా నమోదయ్యాయి. 2014లో తెలంగాణ ఏర్పడిన సమయంలో శిశుమరణాల రేటు 39గా ఉండగా, ఇప్పుడు అది 20కి తగ్గింది. దేశ సగటు 27గా ఉండగా, తెలంగాణ ఇందులో మెరుగ్గా నిలిచింది. తమిళనాడు (12), కర్ణాటక (17), ఆంధ్రప్రదేశ్ (22), కేరళ (6) రాష్ట్రాలు నిలిచాయి.

ఇర్ఫాన్ మృతికి కారణం ఎవరు?

- తగాదా విషయమై పీఎస్‌కు వెళ్లిన దంపతులు
- కాసేపటికే స్టేషన్ బయట వాంతులు చేసుకున్న ఇర్ఫాన్
- ఆసుపత్రికి తరలించే లోపే మృత్యు ఒడికి
- పోలీసులు కొట్టడంతోనే చనిపోయాడంటున్న బంధువులు
- అనారోగ్యంతోనే మృతి చెందాడంటున్న పోలీసులు
- రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలో కలకలం

ఇర్ఫాన్ మృతదేహం

బండ్లగూడ మే 14: రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసులు కొట్టడం వల్లనే బాధితుడు ఠాణా నుంచి బయటకు వచ్చి వాంతులు చేసుకుని అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తుంటే.. కాగా గుండెనొప్పి వల్లనే సదరు వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు చెబుతున్నారు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని మైసూర్ ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్ (35) మొదటి భార్యకు విడాకులు ఇచ్చాడు. అనంతరం నగరానికి వలస వచ్చి.. బండ్లగూడ జాగిర్‌లోని ఖలీజ్ ఖాన్ ప్రాంతంలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలం తర్వాత ఇర్ఫాన్ నిషాద బేగం అనే యువతిని రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు సంతానం.

మరో వివాహితతో పరిచయం..

ఇదిలా ఉండగా వారి ఇంటిపక్కనే నివాసం ఉంటున్న వివాహితతో పరిచయం పెంచుకున్న ఇర్ఫాన్ ఆమెను కూడా వివాహం చేసుకునేందుకు యత్నించాడు. ఈ విషయం తెలుసుకున్న నిషాద.. ఇర్ఫాన్‌ను నిలదీసింది. ఈ మూడోపెళ్లి విషయంలో తలెత్తిన వివాదంతో ఇరు కుటుంబ సభ్యులు గొడవపడి, అదేరోజు రాత్రి పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఇర్ఫాన్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఇరువర్గాల వారు రాజీ కుదుర్చుకొని అంగీకార పత్రం రాసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చిన ఇర్ఫాన్ ఒక్కసారిగా ఠాణా ఆవరణలోనే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని స్థానిక ప్రైవేటు దవాఖానకు తరలించగా ఉస్మానియాకు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో బాధితుడిని ఉస్మానియాకు తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

పోలీసులు కొట్టడం వల్లే చనిపోయాడు..

ఇర్ఫాన్‌ను పోలీసులు కొట్టడంతోనే మృతి చెందాడని అతడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పీఎస్‌కు వెళ్లిన సమయంలో పోలీసులు కొట్టిన దెబ్బలకు తాళలేక ఇర్ఫాన్ పెట్టిన కేకలు స్టేషన్ బయట రోడ్డు వరకు వినిపించాయని.. పోలీసుల దెబ్బలకు ఇర్ఫాన్ బయటకు పరిగెత్తుకొచ్చి రెండుసార్లు వాంతులు చేసుకున్నాడని మృతుడి సోదరుడు వెల్లడించాడు. చివరికి పోలీసు స్టేషన్ ఆవరణలోనే ఇర్ఫాన్ కుప్పకూలిపోయినా పోలీసులు హాస్పిటల్‌కు కూడా తీసుకెళ్లలేదని ఇర్ఫాన్ బంధువులు ఆరోపిస్తున్నారు.

పోలీసులు కొట్టలేదు..

జరిగిన ఘటనపై విచారణ జరిపించాం. స్టేషన్‌లోని సీసీ కెమెరాలను పరిశీలించాం. ఇర్ఫాన్‌ను పోలీసులు కొట్టడం వల్లనే మృతిచెందాడని అతడి కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. వారు స్టేషన్‌కు వచ్చే ముందే ఇంటివద్ద గొడవ పడ్డారు. ఇంటి యజమాని వారించి, పీఎస్‌కు వెళ్లాలని చెప్పడంతో మంగళవారం రాత్రి 9గంటల సమయంలో స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఇరు కుటుంబ సభ్యులకు అక్కడి సిబ్బంది కౌన్సిలింగ్ ఇచ్చి, పంపించారు. పీఎస్ నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఇర్ఫాన్ అనారోగ్యం కారణంగా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే బాధితుడిని చికిత్స నిమిత్తం ఆటోలో ఉస్మానియాకు తరలించగా అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీనిపై బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 194కింద కేసు నమోదు చేశాం.

- చింతమనేని శ్రీనివాస్, డీసీపీ, రాజేంద్రనగర్

మహిళలను అవమానిస్తున్న రేవంత్

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్ రెడ్డి

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): వీర వనితలు రాణి రుద్రమదేవి, సమ్మక్క-సారలమ్మ పుట్టిన నేలపై మహిళలను సీఎం రేవంత్‌రెడ్డి ఘోరంగా అవమానించారని రెడ్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆడబిడ్డల ఆత్మ గౌరవాన్ని పెంచుతామని ఓ వైపు సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని.. మరో వైపు తెలంగాణ ఆడబిడ్డలతో మిస్ వరల్డ్ పోటీదారుల కాళ్లు కడిగించి.. తుడిపించడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని రేవంత్ రెడ్డి బహిరంగ వేదికలపై ప్రసంగాలు చేస్తున్నారని.. కానీ వాస్తవ పరిస్థితులు దానికి పూర్తిగా భిన్నంగా ఉన్నాయని విమర్శించారు. ఓ వైపు పల్లెల్లో మహిళలు తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడుస్తుంటే, మరోవైపు విదేశీ అందగత్తెల కాళ్లు కడిగించడం నియంత పాలనకు నిదర్శమని దుయ్యబట్టారు. ప్రజాపాలన పేరుతో నియంత పాలన కొనసాగిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆడబిడ్డల గౌరవాన్ని తగ్గించిన ఏ ఒక్కరూ బాగుపడినట్టు చరిత్రలో లేదని..రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా త్వరలోనే కూలిపోవడం ఖాయమని సతీష్‌రెడ్డి పేర్కొన్నారు.

విజయ్ షాను బర్తరఫ్ చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బోస్

హిమాయత్‌నగర్, మే 14: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతల వేళ ఆదేశంలోని ఉగ్రవాదుల , సైన్యం స్థావరాలపై భారత్ జరిపిన దాడుల్లో కీలకపాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషిని అవమానపర్చటం దేశ సంస్కృతికి విరుద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీఎస్ బోస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యుద్ధ సమయంలో సోఫియా ఖురేషి ప్రదర్శించిన ధైర్యసాహసాలను దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు ప్రశంసిస్తుండగా మధ్య ప్రదేశ్ బీజేపీ ప్రభుత్వ మంత్రి విజయ్ షా.. సోఫియా ఖురేషిని అవమానపరిచేటట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయ్ షాను వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మోదీ తన అనుయాయులు, ఆర్ఎస్ఎస్ చేస్తున్న దుశ్చర్యలపై మాట్లాడకపోవడం ఆయన చేతగానితనానికి నిదర్శనం అన్నారు. కఠిన సమయాల్లో దేశాన్ని ముందుండి నడిపిన సోఫియా ఖురేషి, విక్రమ్ మిశ్రీని అవమానించేవారిపై కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని బోస్ డిమాండ్ చేశారు.

నగరంలో రోశయ్య కాంస్య విగ్రహం

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): దివంగత నేత, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని జీహెచ్ఎంసీ ఏర్పాటు చేయనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు లక్డీకపూల్‌లో 9 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకుగానూ టెండర్లను ఆహ్వానించింది. ఈ నెల 17వ తేదీలోపు టెండర్ ప్రక్రియను ముగించి జూలై మొదటి వారంలోపు పూర్తిచేయనున్నట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నదీ జలాల పరిరక్షణ అందరి బాధ్యత

మంత్రి కొండా సురేఖ

అమీర్‌పేట్, మే 14: తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతీ నది పుష్కరాలను పురస్కరించుకొని నదీ జలాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు భక్తుల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నదులను పరిరక్షించడం మన బాధ్యత అన్నారు. నదీ జలాల్లో బట్టలు ఉతకడం, వ్యర్థాలను నీటిలో పడేయడం వల్ల నీటి కాలుష్యం తలెత్తే ప్రమాదం ఉందని, దీని ఫలితంగా పుష్కర స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు చర్మసంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజా రవాణాను ఉపయోగించడం వల్ల పొగ కాలుష్యంతో పాటు వాహనాల రద్దీ కూడా తగ్గుతుందన్నారు. పుష్కర స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు పుష్కరాల పవిత్రతను కాపాడటంతో పాటు, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాలని మంత్రి కోరారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాణీ రుద్రమదేవి

సీబీఎస్ఈ ఫలితాల్లో సత్తాచాటిన విజ్ఞాన్

విద్యార్థులను అభినందించిన విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రాణీ రుద్రమదేవి

దుండిగల్, మే 14: సీబీఎస్ఈ విడుదల చేసిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో నిజాంపేట్‌లో విజ్ఞాన్ బోత్రీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 500 మార్కులకు గాను 493, 492, 490 మార్కులతో 5 మంది విద్యార్థులు టాప్ ప్లేస్‌లో నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం నిజాంపేట్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విజ్ఞాన్ విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ రాణీ రుద్రమదేవి వివరాలను వెల్లడించారు. తమ పాఠశాలలోని ప్రతి ముగ్గురు విద్యార్థులలో ఒకరు 95 శాతం మార్కులు, 390 మంది 80 శాతం మార్కులు సాధించడం తమకు గర్వంగా ఉందన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థి పురోగతి పర్యవేక్షిస్తూ వారికి అవసరమైన సూచనలు ఇస్తూ, ప్రోత్సహించడం వల్ల ఈ ఫలితాలు సాధించామన్నారు. విద్యార్థులు చదువులోనే కాకుండా కమ్యూనికేషన్ నైపుణ్యంలో ఉత్తమంగా రాణించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. వివిధ బ్రాంచిల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

మోసపూరిత కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డిసుధాకర్

కవాడిగూడ, మే 14: ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. ఇటీవల ప్యూరోపాల్ క్రియేషన్స్ అండ్ ఐటీ సొల్యూషన్స్ అనే కంపెనీ బోర్డు తిప్పేయడంతో దాదాపు 200 మంది ఉద్యోగులు రోడ్డునపడ్డారని తెలిపారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వారంతా బుధవారం ఆప్ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో కన్వీనర్ దిడ్డి సుధాకర్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. అనంతరం దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు ఉన్నాయని, తమ వద్ద శిక్షణ పొందితే జాబ్ గ్యారెంటీ అంటూ ఆకర్షించి స్కిల్ హబ్ కన్సల్టెన్సీ సంస్థ మోసపూరితంగా ప్యూరోపాల్ ఐటీ సొల్యూషన్స్‌లో ఉద్యోగాలు ఇప్పించిందన్నారు. ప్యూరోపాల్ ఐటీ సొల్యూషన్స్ సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కొక్కరి నుంచి ల్యాప్‌టాప్, రూ.2లక్షలు తీసుకుందన్నారు. జీతాలు కూడా ఇవ్వకుండా రెండు నెలలకే ఆ కంపెనీ బోర్డు తిప్పేయడంతో దాదాపు 200మంది రోడ్డున పడ్డారన్నారు. ఈ విషయమై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ఫిర్యాదు చేస్తామన్నారు.

ఆర్‌సీ ప్లాస్టో భారీ విరాళం

సిటీబ్యూరో, మే 14 (నమస్తే తెలంగాణ): 'ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీ బుధవారం అత్యాధునిక వెటర్నరీ అంబులెన్స్ కోసం గో విజ్ఞాన్ అనుసంధాన కేంద్రానికి రూ.17లక్షలను విరాళంగా ప్రకటించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీలో భాగంగా ఈ విరాళం అందించనట్టు ఆర్‌సీ ప్లాస్టో డైరెక్టర్ నీలేశ్ అగర్వాల్ చెప్పారు. సంస్థ ప్రెసిడెంట్ పద్మేష్ గుప్తాకు చెక్‌ను అందించినట్టు పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్

ఖైరతాబాద్, మే 14: మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా చత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని శాంతి చర్చల కమిటీ అధ్యక్షుడు, విశ్రాంత జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చర్చలకు తాము సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటించినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే శాంతిచర్చలు నిర్వహించాలన్నారు.

గురుకులాల్లో అడ్మిషన్లు : జిల్లా కలెక్టర్ గౌతమ్

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, మే 14: గురుకుల పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన మైనార్టీ గురుకుల పాఠశాలల ప్రవేశాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో కల్పిస్తున్న ఉచిత విద్య, హాస్టల్ వసతి, కాస్మొటిక్ చార్జీలు పెంచిందన్నారు. ఈ అవకాశాన్ని మైనార్టీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పరిధిలోని 8 గురుకుల పాఠశాలలో ఐదు నుండి పదవ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు కాంతమ్మ, జితేందర్, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ప్రతినిధులు

మహిళల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారు

మిస్‌వరల్డ్ అందాల పోటీలను రద్దు చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ప్రతినిధుల డిమాండ్

చిక్కడపల్లి, మే 14: మహిళల ఆత్మగౌరవాన్ని కించపరిచే మిస్‌వరల్డ్ అందాల పోటీలను రద్దుచేయాలని మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల పోటీల నిర్వహణకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తల అక్రమ అరెస్టులను వారు ఖండించారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక నిరసన కార్యక్రమంపై రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక దాడిని ఖండిస్తూ బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఐలమ్మ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఐక్య వేదిక నాయకులు.. మల్లు లక్ష్మి,ఆశాలత,అరుణ జ్యోతి, సంధ్య, స్వరూప, జయ సావిత్రి, శ్రీదేవి, ఝాన్సీ, అనసూయ తదితరులు హాజరై మాట్లాడారు. 72వ మిస్ వరల్డ్ అందాల పోటీలు ఈనెల 10వ తేదీన హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం అయ్యాయి. 109 దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ పోటీలను ఈనెల 31వ తేదీ వరకు జరిపేందుకు 200 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని అన్నారు.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం..

స్త్రీల అందాన్ని శారీరక కొలతలు, అంగాంగ ప్రదర్శనల స్థాయికి దిగజారుస్తున్న ఈ మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్రవ్యాప్తంగా మహిళా, యువజన, విద్యార్థి సంఘాలంతా కలిసి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం అని అన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ నిర్వహిస్తున్న ఈ పోటీలు మహిళల ఆత్మగౌరవాన్ని మార్కెట్ సరుకుగా మారుస్తున్నాయని మండిపడ్డారు. దిగజారిన ఈ మార్కెట్ సంస్కృతి మన స్త్రీల మానమర్యాదలను ఏ మాత్రం పెంచబోవని పేర్కొన్నారు.

వ్యాపార ప్రయోజనాల కోసమే..

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు.. చేనేత పరిశ్రమకు చేయూత ఇచ్చేందుకు, పర్యాటక రంగం అభివృద్ధికి ఈ మిస్ వరల్డ్ అందాల పోటీలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతుందని.. కానీ ఈ పోటీల నిర్వహణ వెనుకున్న అసలు ఉద్దేశం... కాస్మొటిక్ కంపెనీల వ్యాపార ప్రయోజనమే అని వారు ఆరోపించారు.

ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారు..

ఈ వేదిక ద్వారా కొంతకాలంగా మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీన మిస్ వరల్డ్ అందాలు పోటీలు జరుపుతున్న గచ్చిబౌలి స్టేడియం దగ్గర ప్రజాసంఘాలు నిర్వహించిన నిరసన ప్రదర్శనపై పోలీసులు అప్రజాస్వామికంగా దాడి చేశారని విమర్శించారు. కొందరిని అరెస్టు చేసి పరిసర పోలీస్ స్టేషన్లకు తరలించారని అన్నారు. అరెస్టైన వారికి పోలీస్ స్టేషన్లలో తాగడానికి మంచినీళ్లు కూడా ఇవ్వని పరిస్థితి. అరెస్టైన వారిలో షుగర్ పేషెంట్స్ ఉన్నారని పదేపదే చెప్పినా రాత్రి 9:30 గంటల వరకు టిఫిన్ కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. అందరినీ ఫోటోలు తీసుకుని, రాతపూర్వకంగా బాండ్ పేపర్‌పై సంతకాలు పెట్టించుకోని వదిలేశారని తెలిపారు. పౌరులు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేసే కనీసహక్కును కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు.

ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

వారికి ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

సమీక్ష సమావేశంలో అదనపు కమిషనర్ స్నేహ శబరీష్

సిటీబ్యూరో, మే14 (నమస్తే తెలంగాణ): సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు గౌరవమైన జీవన భృతి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని అడిషనల్ కమిషనర్లు స్నేహ శబరీష్, చంద్రకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్‌హాల్‌లో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధులు, ఎన్‌జీఓలతో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌జెండర్ల సేవలను జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలలో వినియోగించే అంశంపై వారి సూచనలు, అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్ల ఆసక్తి, అర్హతల మేరకు జీహెచ్ఎంసీలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి చేపట్టే చర్యల్లో భాగంగా ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీలోనే కాకుండా ఇతర విధాల ఉపాధి పొందడానికి వారికి శిక్షణ కూడా ఇస్తారని చెప్పారు.

ఆర్థికంగా నిలదొక్కుకోవాలి..

జీహెచ్ఎంసీలో పలు ఉద్యోగ అవకాశాలను ట్రాన్స్‌జెండర్లు వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి నిర్ణయమని, అందుకు తమతమ విద్యా అర్హతలు, నైపుణ్యత, ఆసక్తి మేరకు అనువైన రంగాన్ని ఎంచుకోవాలని, దానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోనున్నట్లు యూసీడీ విభాగం అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్‌రెడ్డి వివరించారు. ఉద్యోగ అవకాశాలకు అర్హత లేని ట్రాన్స్ జెండర్లను స్వయం సహాయక గ్రూపులు ఏర్పాటు చేసి ఆర్థిక ఎదుగుదలకు దోహదపడే విధంగా కూడా జీహెచ్ఎంసీ కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే మూడు ట్రాన్స్‌జెండర్ల ఎస్‌హెచ్‌జీ గ్రూపులను ఏర్పాటు చేసి బ్యాంకు లింకేజీ లభించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరిన్ని ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పలు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా వివిధ ఎన్‌జీఓల ద్వారా పలు రంగాల్లో శిక్షణ నిచ్చి స్వయం ఉపాధికి చేయుతనివ్వనున్నట్లు తెలిపారు.

అర్హత ఉన్నవారందరికీ ఉద్యోగాలు..

సెక్యూరిటీ గార్డ్స్, క్లీన్ డ్రైవ్ అమలులో గ్రీన్ మార్షల్స్, పార్కులు, హెచ్ఎండబ్లూఎస్ అండ్ ఎస్‌బీ రిజర్వాయర్ల వద్ద, స్పోర్ట్స్ గ్రౌండ్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్‌లుగా, మెట్రో స్టేషన్‌లో ఉద్యోగ అవకాశాలు, అమృత్ స్కీం కింద నీటి నాణ్యత పరీక్షలో సహకారం, శిక్షణ అనంతరం స్ట్రీట్ లైట్ల నిర్వహణ, బస్తీ దవాఖానాలలో ప్యారా మెడికల్‌గా ఉపాధి పొందే అవకాశం ఉందని, అర్హత గల వారందరిని భర్తీ చేస్తామన్నారు. స్పోర్ట్స్ విభాగంలో ఎలాంటి విద్యార్హత లేని అభ్యర్థుల నుంచి అత్యధిక విద్యార్హతలు ఉన్న వారి వరకు పలు రకాల ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఆయా వివరాలను స్పోర్ట్స్ అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు వివరించారు. సమావేశానికి హాజరైన ట్రాన్స్‌జెండర్ ఎన్‌జీఓలు పలువురు ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా అందిస్తున్న శిక్షణలను వారికి వివరించారు. ఆయా శిక్షణ సంస్థలు ఇస్తున్న ట్రైనింగ్, మార్కెట్ లింకేజి తదితర విషయాలను వివరించారు. పలువురు ట్రాన్స్ జెండర్